# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- జనగణన 2027 మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో రేపటి నుంచి గృహాల గణన ప్రారంభం కానుందని ప్రభుత్వం వెల్లడించింది.
- శ్రీ సత్య సాయి జిల్లా గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హోం మంత్రి వి.అనిత హామీ ఇచ్చారు.
- రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 62 నూతన అన్న కాంటీన్లను ప్రభుత్వం ఈరోజు ప్రారంభించింది.

====================

పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో ఆయన ఈరోజు అమరావతిలోని సచివాలయంలో సమీక్షనిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నీటి వినియోగంపై ముందుగానే ఒక నిర్దిష్టమైన కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు 27,089 కోట్ల రూపాయల ఖర్చు అయిందని, మరో 5,108 కోట్ల రూపాయలతో సివిల్, ఆర్ అండ్ ఆర్ పనులు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంచేశారు. జూన్ చివరి కల్లా వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్ 1 పనులు పూర్తి కావాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు సమీప ప్రాంతాల సుందరీకరణకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. పోలవరం-పాపికొండలు-భద్రాచలం వరకు బోటింగ్ సౌకర్యం కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని నిర్దేశించారు. ఆర్ అండ్ ఆర్ కి సంబంధించి 49 కాలనీలు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి, మరో 20 కాలనీలు 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. మొదటి దశలో మొత్తం 38,060 నిర్వాసిత కుటుంబాలలో.. ఇప్పటి వరకు 16,763 కుటుంబాల తరలింపు జరిగిందని, వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి మిగిలిన కుటుంబాలను కూడా తరలించాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

====================

జనగణన 2027లో భాగంగా రాష్ట్రంలో రేపటి నుంచి మొదటి దశగా గృహాల జాబితా, గణన ప్రారంభం కానుందని ఆంధ్రప్రదేశ్ సెన్సస్ కార్యకలాపాల సంచాలకులు జె.నివాస్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద పరిపాలనా కార్యక్రమంగా నిలిచే జనగణన, ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడటంతో పాటు స్వీయ-గణన సదుపాయం కల్పించడం ద్వారా ప్రత్యేకతను సంతరించుకుందని అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండవ దశగా పాపులేషన్ ఎన్యూమరేషన్ (PE) ద్వారా జనాభా, సామాజిక, ఆర్థిక, వలసలు, జనన వివరాలు సేకరించడం జరుగుతుందని, ఈ రెండవ దశలోనే కుల గణన కూడా చేపడతారని వెల్లడించారు. ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు సహకరించడం ద్వారా ఈ మహత్తర కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

====================

శ్రీ సత్యసాయి జిల్లా కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలిన ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. మంటలు చుట్టు పక్కల ఇళ్ళకు వ్యాపించడంతో ఈ భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనపై హోం మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్లో మాట్లాడి ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు. గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు.

====================

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 62 నూతన అన్న కాంటీన్లను ప్రభుత్వం ఈరోజు ప్రారంభించింది. ఇందులో భాగంగా పెదకూరపాడు నియోజకవర్గం ధరణికోటలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. దీంతో మొత్తంగా రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల సంఖ్య 269కి  చేరింది. అదేవిధంగా విజయనగరం జిల్లా గజపతినగరంలో ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్ ను రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, పేద ప్రజల ఆకలిని తీర్చి, వారికి నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడానికే ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని అన్నారు. జిల్లాలో ఈరోజు కొత్తవలస, గజపతినగరం చీపురుపల్లిలో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరుతూ ...

(వాయిస్…30 సెకన్లు)

====================

విరామం

====================

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎం-రాహత్' పథకం ప్రాణ రక్షణలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరంలో ఈ పథకంపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీసు అధికారులతో కలెక్టర్ ఈరోజు మాట్లాడుతూ, పీఎం రాహత్ అమలుపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి గంటను 'గోల్డెన్ అవర్' గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్యం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. గోల్డెన్ అవర్‌లో బాధితులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. గాయపడిన బాధితులకు ఈ పథకం కింద  లక్షా యాభైవేల రూపాయల వరకు నగదు రహిత వైద్యం అందించబడుతుందన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించడంలో సహాయం చేసే వ్యక్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'గుడ్ సమారిటన్' పథకం అమలు చేస్తోందని, దీనికింద వారికి 25 వేల రూపాయల నగదు పురస్కారం అందజేయబడుతుందని తెలిపారు. సహాయం చేసే వ్యక్తులకు ఎటువంటి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని, వారి వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు.

====================

మత్తు పదార్థాలను పారద్రోలడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి కోరారు. విజయవాడలోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ లో పోలీసులు నిర్వహించిన "డ్రగ్స్ పై దండయాత్ర 2.0" కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. అందులో భాగంగా సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్ డిటెక్షన్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ.. గత 3 నెలలుగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ లో పోలీసు సిబ్బంది ద్వారా డ్రగ్స్ పై అవగాహన తీసుకు వచ్చేందుకు చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావడం అభినందనీయమన్నారు. హైస్కూల్ స్థాయి నుంచే డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని అందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాల బారిన పడిన వారిని గుర్తించి వారిని డీ అడిక్షన్ సెంటర్ లకు పంపడంతో పాటు డ్రగ్స్ నిరోధం, నియంత్రణలో కూడా మార్పులు తీసుకురావచ్చని ఆయన వివరిస్తూ...

(వాయిస్…31 సెకన్లు)

====================

ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో రికార్డుస్థాయి ఉత్తీర్ణత నమోదైందని, ప్రథమ ఇంటర్‌లో 77శాతం, ద్వితీయ ఇంటర్‌లో 81శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. ఫలితాల్లో కృష్ణా జిల్లా అగ్రస్థానంలో నిలవగా, అన్నమయ్య జిల్లా చివరి స్థానంలో నిలిచింది. కాగా.. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (APREIS) 94.36% ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం సాధించిందని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

====================

గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న పిడుగుపాటు మరణాలను క్రమంగా తగ్గించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ దిశగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ)తో గుంటూరు జిల్లా తాడేపల్లిలోని తమ సంస్థ కార్యాలయంలో ఈరోజు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన పాత్రికేయులకు వెల్లడించారు. పిడుగుపాటు సంబంధిత ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో, కమ్యూనిటీల సంసిద్ధతను మెరుగుపరచడంలో, ప్రతిస్పందన యంత్రాంగాలను బలోపేతం చేయడంలో ఈ ఎంవోయూ రాష్ట్ర ప్రభుత్వానికి తోడ్పడుతుందని ఆయన వివరించారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో పిడుగులు ఎక్కువగా పడే హాట్‌స్పాట్‌లను గుర్తించడం, ప్రమాదాలను అంచనా వేయడం, ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆచరణీయమైన నివారణ వ్యూహాలను రూపొందించడం, ముందస్తు హెచ్చరికలను మెరుగుపరచడం ద్వారా పిడుగుపాటు భద్రతా చర్యలను బలోపేతం చేయనున్నామని ఆయన తెలిపారు.

====================

====================